
సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ జయశ్రీ, కౌన్సిలర్ కృష్ణారెడ్డి

పెద్దఅంబర్‌పేట్‌ను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం

● చైర్‌పర్సన్ జయశ్రీ

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్‌ను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని చైర్‌పర్సన్ పండుగుల జయశ్రీరాజు అన్నారు. బుధవారం 7వ వార్డు అశోక్‌రెడ్డి లేఅవుట్‌లో రూ. 8 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణ విజయశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్ దండెం కృష్ణారెడ్డితో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జయశ్రీ మాట్లాడుతూ.. మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. కౌన్సిలర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. 7వ వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. వార్డు పరిధిలోని కాలనీల్లో ప్రధాన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కమిషనర్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్ పసుల రాజేందర్‌ముదిరాజ్, కో-ఆప్షన్ సభ్యుడు ఖలీం, కాంట్రాక్టర్ రవీందర్ పాల్గొన్నారు.


సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మేయర్ పారిజాతారెడ్డి

పలు ప్రాంతాల్లో రూ. 34.50 లక్షలతో సీసీ రోడ్లు

సైదాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పలు ప్రాంతాల్లో రూ. 34.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రజా ప్రతినిధులు బుధవారం శంకుస్థాపన చేశారు. ఎస్బీహెచ్ జీపీ-2 కాలనీలో రూ. 14.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు కార్పొరేటర్ కొత్తకాపు అరుణా రవీందర్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే అహ్మద్ బలాల శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, కార్పొరేటర్లను కాలనీవాసులు సన్మానించారు. జీహెచ్ఎంసీ ఏఈ వెంకన్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సుల్తాన్‌పూర్, ఏఎంఆర్ టౌన్‌షిప్‌లలో..

సరూర్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ 13వ డివిజన్‌లోని సుల్తాన్‌పూర్ టౌన్‌షిప్, 14వ డివిజన్‌లోని ఏఎంఆర్ టౌన్‌షిప్ కాలనీల్లో సుమారు రూ. 20 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మేయర్ చిగిరింత పారిజాతా నర్సింహారెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ డీఈఈలు జ్యోతిరెడ్డి, నర్సింహరాజు, ఏఈఈ వినీల్‌గౌడ్, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బొర్ర జగన్‌రెడ్డి పాల్గొన్నారు.

వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవర్ధన్ తొలగింపు

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలిమండ్ల గోవర్ధన్‌ను ఆ పదవి నుంచి తొలగిస్తున్నట్లు వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దివ్యాంగుల హక్కుల పోరాట సమితి తీసుకున్న నిర్ణయాలకు గోవర్ధన్ వ్యతిరేకంగా పనిచేస్తున్నారని, పలుమార్లు హెచ్చరించినా ఆయన తీరులో మార్పు రాలేదన్నారు. కమిటీ ఆదేశాల మేరకు గోవర్ధన్‌ను వీహెచ్‌పీఎస్, ఎంఆర్‌పీఎస్ నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు.


బీసీల శంఖారావం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ డాక్టర్స్ ఫోరం కన్వీనర్ డాక్టర్ శ్రీనివాస్‌గౌడ్, సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు రాజు తదితరులు

బీసీ జాతీయ సదస్సును జయప్రదం చేయండి

మన్సూరాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బీసీ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 11, 12 తేదీల్లో ఢిల్లీలో బీసీల సమర శంఖారావం పేరిట నిర్వహించే బీసీ జాతీయ సదస్సు, ధర్నాను విజయవంతం చేయాలని బీసీ డాక్టర్స్ ఫోరం కన్వీనర్ డాక్టర్ శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం ఎల్బీనగర్‌లో మహాత్మజ్యోతిరావు పూలే విగ్రహం వద్ద సదస్సు, ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజు మాట్లాడుతూ.. సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సోషల్ జస్టిస్ పార్టీ ఇన్‌చార్జి కేవీగౌడ్, జాతీయ స్పోక్స్ పర్సన్ కొండల్‌గౌడ్, ఓబీసీ జాతీయ జేఏసీ చైర్మన్ వేణు పాల్గొన్నారు.


జలమండలి అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

శ్రీశంకర్ కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి

కొత్తపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీశంకర్ కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ పవన్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన కాలనీలో పర్యటించారు. కాలనీవాసులు పలు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త పైపులైన్లు వేసేందుకు చర్యలు తీసుకోవాలని జలమండలి ఏఈ స్రవంతిని, కాలనీ సంక్షేమ సంఘం కమ్యూనిటీ హాల్‌కు మరమ్మతులు చేయించాలని జీహెచ్ఎంసీ ఏఈ మాతృనాయక్‌ను కోరారు. విద్యుత్ స్తంభాలు, వీధిదీపాల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కాలనీ ప్రతినిధులు, జలమండలి సిబ్బంది పాల్గొన్నారు.


నేవీ డేలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నేవీ డే

హయత్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేవీ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి ఎన్‌సీసీ క్యాడెట్స్ ఇచ్చిన గార్డ్ ఆఫ్ ఆనర్‌ను స్వీకరించి నేవీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్‌సీసీ క్రమశిక్షణకు మారుపేరు అని అన్నారు. ఎన్‌సీసీ క్యాడెట్‌లు సమాజానికి దిక్సూచిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ కో-ఆర్డినేటర్ బకరం నరసింహ, ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ ఎ. యాదయ్య అధ్యాపకులు పాల్గొన్నారు.

చందచెరువు ఆక్రమణలపై హైడ్రా నజర్

● ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ను పరిశీలించిన అధికారులు
● ఖాళీ స్థలాన్ని కాపాడేందుకు ప్రణాళికలు

సరూర్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానికుల ఫిర్యాదు నేపథ్యంలో జిల్లెలగూడలో గల చందచెరువు ఆక్రమణలపై హైడ్రా అధికారులు దృష్టిసారించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ను పరిరక్షించేందుకు కసరత్తు చేస్తున్నారు. బుధవారం చెరువును సందర్శించారు. చెరువు విస్తీర్ణం ఎంత.. అందులో ఎంత మిగిలింది.. ఏమేరకు కట్టడాలు వెలిశాయి.. వాటికి అనుమతులు ఉన్నాయా లేదా.. వంటి అంశాలపై స్థానికులను అడిగి వివరాలు సేకరించారు. రెవెన్యూ, ఇరిగేషన్ రికార్డులతో కలిసి చెరువు చుట్టూ తిరిగారు. గతంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్వయంగా చందచెరువును సందర్శించిన సంగతి తెలిసిందే. అప్పట్లో చెరువు ఎఫ్‌టీఎల్‌లోని అక్రమ నిర్మాణాలన్నీ నేలమట్టమవుతాయని భావించినప్పటికీ.. కూల్చివేతలపై వెనుకడుగు వేశారు.

స్థానికంగా ఆందోళన

హైడ్రా అధికారులు చెరువును సందర్శించి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిపై ఆరా తీయడంతో స్థానికంగా ఆందోళన మొదలైంది. అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తారనే వార్తలు వినిపిస్తుండడంతో ఆక్రమణదారులు ఆందోళన చెందుతున్నారు. హైడ్రా తమ జోలికి రాకుండా చూడాలని బడా నాయకులను ఆశ్రయిస్తున్నట్టు తెలిసింది. ఆర్‌సీఐ రోడ్డుకు ఇరువైపులా చందచెరువు ఎఫ్‌టీఎల్ విస్తరించి ఉండగా, సదరు స్థలంలో అనేక షెడ్లు, పలు శాశ్వత కట్టడాలు, వ్యాపార సంస్థలు వెలిశాయి. వాటికి అనుమతులు లేనట్టు తెలుస్తోంది. కొందరు కబ్జాదారులు పాత గ్రామ పంచాయతీ అనుమతులను చూపిస్తూ తమ నిర్మాణాలు సక్రమమే అని నమ్మించడానికి ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. ఈ క్రమంలో చందచెరువు కబ్జాదారులపై హైడ్రా చర్యలు తీసుకుంటుందా లేదా అన్నది స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. చెరువును సందర్శించిన వారిలో హైడ్రా అధికారులు విజయ్‌కుమార్, తిరుమలేశ్, బాలాపూర్ ఎంఆర్ఐ ప్రశాంతితో పాటు ఇరిగేషన్, మునిసిపల్ అధికారులు ఉన్నారు.


జిల్లెలగూడ చందచెరువు ఆక్రమణలను పరిశీలిస్తున్న హైడ్రా అధికారులు

రైతుల పక్షపాతి సీఎం రేవంత్‌రెడ్డి

● కోహెడలో అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ ప్రకటనపై హర్షం
● వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి రైతుల పక్షపాతి అని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి అన్నారు. కోహెడలో అంతర్జాతీయ స్థాయిలో సమీకృత మార్కెట్ నిర్మాణ ప్రకటనపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. బుధవారం బాటసింగారంలోని ఫ్రూట్ మార్కెట్‌లో పాలకవర్గం, రైతులు, వర్తకులతో కలిసి సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. త్వరలో కోహెడలో 250 ఎకరాల్లో రూ. 2 వేల కోట్లతో అంతర్జాతీయ సమీకృత మార్కెట్ నిర్మాణం కాబోతుందన్నారు. రైతులకు న్యాయం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అన్నారు.


సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, డైరెక్టర్లు, రైతులు, వర్తకులు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కేటీఆర్, హరీశ్‌రావు కొత్త డ్రామాలు మొదలు పెట్టారని, వారిని ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సీహెచ్ భాస్కరాచారి, డైరెక్టర్లు మధుసూదన్ రావు, జైపాల్‌రెడ్డి, అంజయ్య, రఘుపతిరెడ్డి, గణేష్‌నాయక్, నరసింహ, నవరాజ్, గోవర్ధన్ రెడ్డి, వెంకట్‌గుప్తా, ఇబ్రహీం, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్, రైతులు, వర్తకులు పాల్గొన్నారు.

జల్సాల కోసం చోరీలు

● నిందితుడి అరెస్ట్.. వాహనాలు స్వాధీనం

చాదర్‌ఘాట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జల్సాల కోసం చోరీలు చేస్తున్న వ్యక్తిని చైతన్యపురి పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి చోరీ చేసిన వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్‌రావు వివరాలు వెల్లడించారు. గోల్కొండ ఫోర్ట్ వద్ద నివసిస్తున్న సయ్యద్ సాహిల్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. జల్సాలకు అలవాటు పడడంతో వచ్చిన డబ్బు సరిపోకపోవడంతో వాహనాలను దొంగిలించాలని నిర్ణయించుకున్నాడు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్‌ల పరిధుల్లో వాహనాల దొంగతనాల కేసుల్లో అరెస్ట్ అయి జైలుకెళ్లాడు. అయినా అతడి తీరులో మార్పు రాలేదు. జైలు నుంచి విడుదలైన తర్వాత వాహనాలను చోరీ చేయడం ప్రారంభించాడు.

బుధవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా.. సాహిల్ దొంగిలించిన యమహా బైక్‌పై వస్తూ అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకున్నారు. వాహన పత్రాలను చూపించకపోవడంతో అదుపులోకి తీసుకున్నారు.


స్వాధీనం చేసుకున్న వాహనాలు

విచారించగా.. చైతన్యపురి పీఎస్ పరిధిలో రెండు వాహనాలు, దోమలగూడలో మరో రెండు, మాదాపూర్‌లో ఒక వాహనాన్ని దొంగిలించినట్టు అంగీకరించాడు. అతడి నుంచి కారు, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ. 15 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. సాహిల్‌పై 17 కేసులున్నాయన్నారు. క్రైం ఇన్‌స్పెక్టర్ గురుస్వామి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'కుల దురహంకార హత్యలను ఖండిస్తున్నాం'

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కుల దురహంకార హత్యలను ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండిస్తుందని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు గుండె శివకుమార్ తెలిపారు. బుధవారం అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రెండు రోజుల క్రితం ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామంలో కులాంతర వివాహం చేసుకుందన్న కారణంతో కానిస్టేబుల్‌ను సొంత అన్న దారుణంగా నరికి చంపడాన్ని ఖండించారు. కుల దురహంకారంతో విర్రవీగే వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రణయ్, వరుణ్, ప్రణయ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్

ఎమ్మార్పీఎస్ నేతల నిరసన

సైదాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మాలల సింహగర్జనలో మందకృష్ణ మాదిగపై చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మాదన్నపేటలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఎమ్మార్పీస్ నేతలు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. వర్గీకరణను అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతుండగా, ఎమ్మెల్యే వివేక్ వ్యతిరేకించడం క్రమశిక్షణా రాహిత్యమన్నారు. ఆయనపై కాంగ్రెస్ అధిష్ఠానం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో ఎమ్మార్పీస్ నేతలు గునుగుర్తి రవీంద్రనాథ్, దర్శనం నర్సింగరావు, కట్ట సుదర్శన్, కె.రవీందర్, మహేష్, నారాయణ, పాండు, శరత్ పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

మన్సూరాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విజయవాడ జాతీయ రహదారిలో ఎన్టీఆర్ నగర్ వ్యవసాయ మార్కెట్ ఎదుట ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు బుధవారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ అదనపు సీఐ నాగరాజు, ఎస్ఐ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలి'

కొత్తపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని రాచకొండ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (టీటీఐ) ఇన్‌స్పెక్టర్ అర్జున్ అన్నారు. బుధవారం ట్రాఫిక్ కాంప్లెక్స్‌లోని రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కులో ప్రైవేట్ స్కూల్ విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై పోస్టర్లు, రోడ్ సైన్స్ చూపిస్తూ వాటి గురించి వివరించారు.

లెక్చర్ హాల్‌లో వీడియో క్లిప్స్, సిమ్యులేటర్‌పై సురక్షిత వాహన డ్రైవింగ్‌ను చూపించారు. హెల్మెట్ వాడకం ప్రాధాన్యత గురించి వివరించారు. కార్యక్రమంలో టీటీఐ విశ్రాంత ఇన్‌స్పెక్టర్ అమరవర్ధన్‌రెడ్డి ఏఎస్ఐ సోమ్‌నాథ్, సేఫ్టీ ట్రెయినర్ ప్రవీణ్, సిబ్బంది రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గాయకుడు రామకృష్ణకు ఘంటసాల అవార్డు

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పద్మశ్రీ ఘంటసాల 102వ జయంతిని కుంట్లూర్‌లోని వేగేశ్న ఫౌండేషన్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఘంటసాల గుడిలో ఘంటసాలకు అభిషేకం, పూజలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గాయకుడు వైఎస్ రామకృష్ణ పాల్గొన్నారు. ఆయనను ఘంటసాల ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ వంశీ రామరాజు సత్కరించి ఘంటసాల అవార్డు అందజేశారు. మేనేజింగ్ ట్రస్టీ శైలజ సుంకరపల్లి, గాయకులు రవిశంకర్‌ఠాగూర్, రవీంద్ర ఆచార్య, కశ్యప్, వీణ, రాధారాణి, సుధామయి పాల్గొన్నారు.


రామకృష్ణకు ఘంటసాల అవార్డును అందజేస్తున్న వంశీ రామరాజు

'జీఎస్ఐలో సమస్యలను పరిష్కరించాలి'

మన్సూరాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నాగోల్ బండ్లగూడలోని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సంస్థలో సమస్యలను పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈమేరకు డైరెక్టర్ జనరల్ ఆసిత్‌కుమార్ సాహుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ చైర్మన్ ఆదర్శ మహేష్, రీజనల్ కార్యదర్శి మధిర సత్యనారాయణ మాట్లాడుతూ.. సంస్థలో శిథిలావస్థలో ఉన్న ఆడిటోరియంను పునరుద్ధరించాలని, 20 ఏళ్లుగా ఒకే పోస్టులో కొనసాగుతున్న వారికి పదోన్నతి కల్పించాలని, ఎస్సీ, ఎస్టీ మీట్‌ను వెంటనే నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ఏడీజీ అండ్ హెచ్‌వోడీ పట్నాజే, డైరెక్టర్ అండ్ హెడ్ ఆఫ్ ఆఫీస్ హార్మీన్ మిశ్రా, అసోసియేషన్ వైస్ చైర్మన్ బి. శ్రీనివాసరావు, బి. ఆనంద్‌కుమార్, ఎ. మేఘరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఉపాధ్యాయుడి అదృశ్యం

హయత్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ స్కూల్ ఉపాధ్యాయుడు అదృశ్యమయ్యాడు. పద్మావతి కాలనీలో నివసిస్తున్న చల్లమల్ల శ్రీనివాస్(47) హయత్‌నగర్‌లోని నారాయణ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. పిల్లలకు ట్యూషన్ చెప్పి వస్తానని గతనెల 30వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. అతడి ఆచూకీ లభించకపోవడంతో భార్య ప్రశాంతి హయత్‌నగర్ పోలీసులకు బుధవారం రాత్రి ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మార్పీఎస్ గుర్రంగూడ కార్యవర్గం ఎన్నిక

సరూర్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ గుర్రంగూడ కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని ఎమ్మార్పీఎస్ బాలాపూర్ మండల అధికార ప్రతినిధి వంక ఉపేందర్, మాజీ అధ్యక్షుడు పుట్టగల్ల రాము, మండల కో-ఇన్‌చార్జి కనగట్ల రవి తెలిపారు. అధ్యక్షుడిగా పుట్టగల్ల వెంకటేశ్, ఉపాధ్యక్షులుగా పుట్టగల్ల దశరథ్, రాజు, అధికార ప్రతినిధిగా తుమ్మలూరు దశరథ్, ప్రధాన కార్యదర్శిగా పి. కుమార్, ప్రచార కార్యదర్శులుగా పుట్టగల్ల తరుణ్, ఆకాశ్, కార్యదర్శిగా భాను, సహాయ కార్యదర్శిగా పుట్టగల్ల చిన్న వెంకటేశ్, సభ్యులుగా పుట్టగల్ల నరసింహ, విజయ్, జనార్దన్ గణేశ్ తదితరులను ఎన్నుకున్నామని చెప్పారు.

సైబర్ నేరాలపై అవగాహన

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ సైబర్ సెక్యూరిటీ విభాగం డీఎస్పీ భిక్షం రెడ్డి అన్నారు. కుంట్లూర్ పరిధిలోని పల్లవి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం "సైబర్ స్పేస్‌లో మహిళల భద్రత" అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల చైర్మన్ మల్కా కొమురయ్య మాట్లాడుతూ.. వేగంగా అభివృద్ధి చెందుతున్న సైన్స్ అండ్ టెక్నాలజీ పరిశోధన రంగంలో సైబర్ సెక్యూరిటీ అంశాలపై అవగాహన ఉండాలన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ భిక్షంరెడ్డి

నల్సార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ బాలకృష్ణ, సైబర్ క్రైమ్ ఎస్ఐలు సత్యనారాయణ, రాజు, కమలాబాయి, సీఎస్ఐ మెంబర్ డాక్టర్ శ్రీకాంత్, కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మల్కా నవీన్, డైరెక్టర్ రామశేషగిరిరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంబీ రాజు తదితరులు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

సిబ్బందిని ఇబ్బంది పెట్టే డీసీ మాకొద్దు

మన్సూరాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సిబ్బందిని ఇబ్బంది పెడుతున్న సర్కిల్-4 ఉపకమిషనర్ తమకొద్దంటూ ఎల్బీనగర్ మూడు సర్కిళ్ల కార్యాలయం ఎదుట ఉద్యోగులు, సిబ్బంది బుధవారం ఆందోళన చేపట్టారు. డీసీ మాకొద్దంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డిప్యూటీ కమిషనర్ ఇస్లావత్ సేవానాయక్ నియంతృత్వ పోకడలతో ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, మహిళా ఉద్యోగులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. వెంటనే ఆయనను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో శ్రీధర్, శంకర్, యాదగిరి, శ్రీనివాస్, శివకుమార్, కిషోర్, సత్యనారాయణ, నర్సింగ్ రావు, ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులను ఇబ్బంది పెట్టడం లేదు : డీసీ

ఉద్యోగులను ఇబ్బంది పెట్టడం లేదని డీసీ వివరణ ఇచ్చారు. పన్నుల వసూలు విషయమై ఉన్నతాధికారుల సూచనలను కిందిస్థాయి ఉద్యోగులకు చెప్పానే తప్ప మరే ఉద్దేశం లేదన్నారు. సరిగా పనిచేయని కొందరు ఉద్యోగులు తనపై విమర్శలు చేస్తున్నారని అన్నారు.


కాంగ్రెస్ మోసాలపై చార్జిషీట్‌ను విడుదల చేస్తున్న సామ రంగారెడ్డి తదితరులు

కాంగ్రెస్ మోసాలను ఎండగడతాం

● బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి
● 7న సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో బీజేపీ బహిరంగ సభ

మన్సూరాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అబద్ధపు వాగ్దానాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని, వారి మోసాలను ఎండగడతామని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 7వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, ముఖ్యఅతిథిగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పాల్గొంటారని తెలిపారు. 118 జీవోను అమలు చేయాలని, రిజిస్ట్రేషన్ల సమస్యను పరిష్కరించాలన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అనుచరులు 15 సంవత్సరాలుగా ప్రభుత్వ భూములు, పార్కులు, చెరువులను కబ్జా చేశారని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కొత్త రవీందర్ రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేందర్ యాదవ్, కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, చింతల అరుణా సురేందర్‌యాదవ్, వంగ మధుసూదన్ రెడ్డి, కళ్లెం నవజీవన్ రెడ్డి, ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి, నూతి శ్రీనివాస్‌రావు, ఐలయ్యయాదవ్, కిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సాగర్ రోడ్డులో ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

గ్యారెంటీల అమలులో ప్రభుత్వం విఫలం

చంపాపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ హస్తినాపురం డివిజన్ అధ్యక్షుడు నరేష్ యాదవ్ అన్నారు. బుధవారం బైక్ ర్యాలీ, సాగర్ రోడ్డుపై ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలను చేసి అధికారంలోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు మందటి శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్, రాజుగౌడ్, మల్లేష్‌గౌడ్, జీవన్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, కోట్ల శివ, రాఘవయాదవ్, శివరెడ్డి, శేఖర్‌రెడ్డి, సాయిరెడ్డి, మహేష్ పాల్గొన్నారు.


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

హయత్‌నగర్‌లో బైక్ ర్యాలీ

హయత్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఇచ్చిన ఏ ఒక్క హామీ నిలబెట్టుకోలేదని బీజేపీ ఆరోపించింది. పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు ఉగాది ఎల్లప్ప ఆధ్వర్యంలో బుధవారం హయత్‌నగర్‌లో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి గోవిందాచారి, సీనియర్ నాయకులు వీరేష్, జాంజ్యా నాయక్, నరేష్, నరసింహ, సురేష్, ఎర్ర ప్రేమ్, ఓంకార్, మహేష్, మహేందర్, సాయి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు

మన్సూరాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు, వరల్డ్ వైల్డ్‌లైఫ్ కన్జర్వేషన్ డేను పురస్కరించుకుని అటవీ శాఖ ఆధ్వర్యంలో బుధవారం వనస్థలిపురంలోని సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్ విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. అడవులు, వన్యప్రాణుల ప్రాముఖ్యత, అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి అవగాహన కల్పిస్తూ మహవీర్ హరిణ వనస్థలి పార్కు నుంచి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓ విజయానంద, ఎఫ్ఆర్ఓ సాయిప్రకాశ్, ఎఫ్ఎస్ఓలు విద్యాసాగర్, సుజాత, ఎఫ్‌బీఓలు నవీన్, కృష్ణవేణి, ఉమాదేవి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు

చంపాపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ధ్యానాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన ఆలయంతోపాటు ఉప ఆలయాల్లో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ గణపతి, మాన్యు సూక్త సహిత సుదర్శన హోమం వేద పండితులు నిర్వహించారు.